క్లుప్తంగా

కుట్టుమిషన్లు పంపిణీ



పెద్దకొత్తపల్లి: సాతాపూర్‌లో మహిళా సంఘాల సభ్యులకు 2 యూనిట్ల కుట్టు మిషన్లను కొల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరమేశ్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో బ్యాంక్ లోన్ ద్వారా మంజూరైన మిషన్లను మహిళలకు పంపిణీ చేశారు. రాములు, మధు, రాంప్రసాద్, లింగస్వామి, కుర్మయ్య, శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

వెల్దండ: మండల పరిధిలోని దుబ్బతండాలోని ఎస్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శనివారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్టీ కమ్యూనిటీ ప్రజలు సమావేశాలు నిర్వహించుకోవడానికి కనీసం భవనం లేదన్నారు. విషయాన్ని ఐక్యత ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లడంతో భవన నిర్మాణానికి రూ.2 లక్షల సాయం అందిస్తామన్నారు. గతంలో రూ.లక్షతో పనులు చేపట్టడంతో రెండో విడత మరో రూ.లక్షను ఎస్టీ కమ్యూనిటీ నాయకులకు అందజేశారు.

ఎస్‌ఐకి ఫిర్యాదు

కల్వకుర్తి రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కించపరచడంతో పాటు హేళనగా మాట్లాడిన వెల్దండ మండలం పెద్దాపూర్‌కి చెందిన అనిల్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేవైఎం ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు పరశురాములు శనివారం ఎస్‌ఐ రమేశ్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు.

వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్‌కి చెందిన అనిల్ బీజేపీతో పాటు నాయకులను విమర్శలు చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని శనివారం వెల్దండ ఎస్‌ఐ శ్రీనివాసులుకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

కొల్లాపూర్ ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ

కొల్లాపూర్: కొల్లాపూర్ ఎంపీడీఓగా చెన్నమ్మ బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఆమె లాంచనంగా విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా పనిచేసిన శ్రీనివాసు నుంచి ఆమె బాధ్యతలు అందుకున్నారు. చెన్నమ్మను ఎంపీపీ బోజ్యానాయక్‌తో పాటు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

సమావేశం ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఏప్రిల్ మాసం మహనీయుల జన్మదినాలకు నెలువైందని మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. మహనీయుల జయంతి ఉత్సవాలు ఏప్రిల్ 5న బాబుజగ్జీవన్‌రాం, 11న జ్యోతిరావు పూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు కొనసాగుతాయని, ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో దళిత, గిరిజన సామాజిక ప్రజాసంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకునే ఆనవాయితీ ఉందని, దళితుల సమస్యలు చర్చించాలని, కంప్యూటర్ యుగంలోనూ కులవివక్ష, అంటరానితనం కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తుడికి సన్మానం



కొల్లాపూర్: పట్టణంలోని మాదవస్వామి ఆలయంలో మార్బుల్ గ్రానేట్ బండలు వేయించిన భక్తుడు ఊశన్నగౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు శనివారం సత్కరించారు. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డా.విజయ్‌కుమార్, వెంకటస్వామిగౌడ్, సతీష్, నరేందర్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, మల్లయ్య, లచ్చగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల వినతి

తెలకపల్లి: మండల కేంద్రంలోని బీఎస్పీ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ యాత్ర సందర్భంగా బీఎస్పీకి సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటికి అడ్డంగా బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, అధికార పార్టీకి చెందిన నాయకులు ఈ ఫ్లెక్సీలు కట్టడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి భాస్కర్‌కు శనివారం బీఎస్పీ నాయకులు వినతి అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శివశంకర్, భాస్కర్, సురేశ్, సంపత్, బాలకృష్ణ, శ్రీకాంత్, ఆంజనేయులు పాల్గొన్నారు.



జోరుగా ఇసుక దందా

- వాగుల నుంచి మట్టిని ఫిల్టర్ చేసి రవాణా
- భూగర్భజలాలు అడుగంటుతున్నాయంటున్న ప్రజలు
- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు



తీగలపల్లి రిజర్వాయర్ వద్ద ఫిల్టర్ ఇసుక తయారు

కోడేరు: మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతుంది. రెండు నెలల నుంచి నాగులపల్లి తండా, మూలమడత తండా, ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నె, తీగలపల్లి రిజర్వాయర్ నుంచి అక్రమార్కులు జేసీబీ సాయంతో ఇసుకను తోడేస్తున్నారు. అభివృద్ధి పనులకు ఇసుకను తరలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేస్తే.. దానిని అదునుగా తీసుకొని ఇతర పనులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక అనుమతి పత్రంతో 10 నుంచి 15 ట్రిప్పుల వరకు ఇసుకను వాగులో నుంచి తీసి ఇతర పట్టణాలకు తరలిస్తున్నారు. తీగలపల్లి రిజర్వాయర్ నుంచి నెల రోజులుగా మట్టిని తీసి ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. ఫిల్టర్ ఇసుక వాడటంతో సీసీరోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నెర్రలు బారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు అధికారుల పనితీరును విమర్శిస్తున్నారు. కొందరు ట్రాక్టర్ యజమానులు వాగు నుంచి ఇసుకను తోడేసి వ్యవసాయ పొలాల వద్ద దాదాపు వంద ట్రిప్పులకు పైగా నిల్వ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ ఓనర్లు అధికారులకు రూ.5వేల నుంచి రూ.10 వేల వకు మామూళ్లు ఇస్తున్నామని బహిరంగంగానే చెబుతున్నారు. ఇసుకను తోడేయడంతో వాగుల కింద ఉన్న పంట పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మూలమడత తండాలో ఇసుక తీసేందుకు వచ్చిన జేసీబీ

అడ్డుకట్ట వేయాలి..

వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వేసవి కావడంతో పంట పొలాలకు నీరు అందకుండాపోతుంది. దీంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి.

– కృష్ణయ్య

అక్రమ రవాణా చేస్తే చర్యలు..



అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుకను తరలించే వారు ఖచ్చితంగా రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు తీసుకోవాలి.

– యాలాద్రి, సీఐ

భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను అరికట్టాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి: వ్యవసాయ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను అరికట్టే బాధ్యత తహసీల్దార్‌పై ఉందని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుతో మాట్లాడారు. గ్రామాల్లో కొంత మంది రైతులు భూములను అమ్ముకోవడం జరగుతుందని, అందుకు విరుద్ధంగా ఆ సర్వే నంబర్‌లోనే అమ్మిన వ్యక్తుల భూములు తొలగించకుండా భూములు అమ్మని రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో తొలగించడంతో అసలు రైతులు నిరాశకు గురవుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. వెన్నచర్లలో సర్వే నంబర్ 41, ఇతర గ్రామాల్లోని 14 సర్వే నంబర్‌లో మిస్సింగ్ అయిన రైతులు చాలా ఉన్నారని తెలిపారు. మండలంలో ఏ గ్రామంలో చూసినా భూములు అక్రమంగా మార్పిడి జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయని, వాటిని అరికట్టే బాధ్యత మీపైనే ఉందని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి గ్రామంలో విచారణ చేపట్టేందుకు చర్యలు చేపడుతానని తహసీల్దార్ తెలియజేశారు. ఆయన వెంట భాస్కర్‌రెడ్డి, రవికుమార్, పర్వతాలు, శివరావు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



ఊర్కొండ: తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మాదారంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక రాష్ట్రంలో అన్ని గ్రామాలు అభివృద్ధితో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో నిర్మిస్తున్న సీసీరోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ముస్లింకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ చైర్మన్ శాంతకుమారి, వీరారెడ్డి, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్ పంచాయతీ రాష్ట్ర స్థాయికి ఎంపిక



సర్పంచ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి కేటీఆర్

తాడూరు: మండలంలోని అల్లాపూర్ గ్రామపంచాయతీ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డుకు ఎంపికైంది. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా జ్ఞాపికను సర్పంచ్ నిరంజన్‌కు అందజేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన అల్లాపూర్ గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో కూడా ఎంపికయ్యేందుకు అన్ని అర్హతలు సాధించేందుకు కృషి చేశామని సర్పంచ్ నిరంజన్ తెలియజేశారు. హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మనూ చౌదరి, జెడ్పీ సీఈఓ ఉశ, ఎంపీడీఓ గంగామోహన్, డీఆర్‌డీఓ నర్సింగరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

పనుల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లి, చంద్రకల్, గుంతకోడూరు గ్రామాల్లో ఎంపీడీఓ గంగామోహన్ శనివారం ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలకు పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గ్రామంలో వంద మంది కూలీలకు తక్కువ కాకుండా పనుల్లో పాల్గొనేలా చూడాలని టీఏ పార్వతమ్మతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ బాలరాజును కోరారు. పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు.



ఇంద్రకల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

ఘనంగా ఏకాదశి పారాయణ మహోత్సవం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయినగర్ కాలనీలో శనివారం ఏకాదశి పారాయణం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పారాయణ సమితి సభ్యులు పరమేశ్వర్, బాలరాజు, సత్యనారాయణ, రమ్య, సంధ్యారాణి, వరలక్ష్మి సూర్యకళ, జయ పాల్గొన్నారు.

కుక్కల బెడద అరికట్టాలి

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో నెల కొన్న కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు శనివారం గ్రామకార్యదర్శి హారిణికి వినతి అందజేశారు. వీధి కుక్కలతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రుక్మద్దిన్, చెన్నగౌడ్, గణేశ్, ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష రాయడానికి అవసరమయ్యే సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్యాడ్లు, స్కేల్, పెన్నులు తదితర వస్తువులు అందజేశారు. సోమవారం నుంచి పరీక్షలు రాయబోయే విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. బీజేపీ నాయకులు ఎల్లయ్యయాదవ్, పరమేశ్వరాచారీ, శివ, ఆనంద్, అనిల్‌గౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి, ఐతోల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్, ప్యాడ్‌లను పంపిణీ చేశారు. క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్, అంజయ్య, విజయ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా స్వయంపాలన



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గోవర్ధన్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రదర్శనను తిలకించారు. మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, సర్పంచ్ పాండుగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేలం

బిజినేపల్లి: తిమ్మాజీపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం మద్యం డిపో టోల్‌గేట్ వేలం, తైబజార్ వేలం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్ అధ్యక్షతన శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేలంలో మద్యం డిపో టోల్‌గేట్‌ను సురేందర్ రూ.10,70,000కు దక్కించుకున్నాడు. కాగా తైబజార్ వెలంలో గ్రామానికి చెందిన వెంకటయ్య రూ.2,12,800 దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ తెలియజేశారు.

వ్యాయామ విద్యతో ఉపాధి అవకాశాలు



కొల్లాపూర్: వ్యాయామ విద్యతో యువతకు ఎన్నో రకాల ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఉస్మానియా యూనివర్సిటీ పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డా.రాజేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన కొల్లాపూర్‌లోని హాసిని టీటీఈడీ కళాశాలను సందర్శించారు. వ్యాయామ విద్య కోర్సు చదువుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కళాశాల నిర్వాహకులు సురగౌని శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అధ్యాపకులు రాజేష్‌కుమార్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఓయూ బోర్డుఆఫ్ స్టడీస్ డైరెక్టర్ జీబ్లానాయక్ ఉన్నారు.

చిరుధాన్యాలపై బాలింతలకు అవగాహన



పెద్దకొత్తపల్లి: చెన్నపురావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలు, పోషకాహారంపై బాలింతలు, గర్భిణిలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ రాంచంద్రయ్య మాట్లాడారు. పోషక ఆహారం పొందేందుకు చిరుధాన్యాలను తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

30న పెద్దదర్గా కందూరు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌లో 400 ఏళ్ల కిందటి పురాతనమైన నియాషరీఫ్ పెద్ద దర్గా ఉర్సు హాజీ హజ్రత్ సయ్యద్ దర్వేష్ అలీ షా ఖాద్రి ఉత్సవాలు ఈ నెల 30 నిర్వహించనున్నారు. పీర్ల పండుగ అయిన 20 రోజులకు ఈ ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి సయ్యద్ షా బుర్హనుద్దీన్ షా ఖాద్రి తెలియజేశారు. అంతేకాకుండా ఈ దర్గా ఆరు నెలల పాటు కృష్ణా నదిలో మునిగి మరో ఆరు నెలలు కృష్ణానది నీటి ఒడ్డున ఉంటుంది. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున ఈ దర్గా వద్దకు వస్తుంటారు. మరికొద్ది రోజుల్లో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దర్గా పరిసర ప్రాంతాలు శుభ్రపరిచి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని, అంతేకాకుండా 30న పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంటుందని వివరించారు.

పరీక్షలకు సకాలంలో హాజరుకావాలి

తెలకపల్లి: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని పరీక్షల కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం సూచించారు. మండల కేంద్రంలో బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేకేరెడ్డి ఉన్నత పాఠశాల, గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజు ఉదయం 9.35 నుంచి 12.30 నిమిషాల వరకు పరీక్షలు జరగనున్నాయని, 5 నిమిషాలు ఆలస్యమైనా పరీక్షలకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులకు తాగునీటి వసతి, మూత్రశాలలు, మెడికల్ వసతి ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని, విద్యార్థులంతా 8.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలని తెలియజేశారు.



వెల్దండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్న ఉపాధ్యాయులు

పది పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ హైస్కూల్‌లో పదో తగరతి పరీక్షలకు శనివారం ఏర్పాట్లను పూర్తి చేశారు. మోడల్ హైస్కూల్‌లో 230 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 163 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను తీసుకుని సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని పరీక్ష కేంద్రాల నిర్వాహకులు పర్వతాలు, రాజేంద్రర్ పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

నాగర్‌కర్నూల్: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను శనివారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటమరణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



‘ఉపాధి’ సద్వినియోగం చేసుకోవాలి

వెల్దండ: వేసవి కాలంలో రైతులకు, రైతు కూలీలకు కల్పిస్తున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం వెల్దండ మండల పరిధిలోని కొట్ర, పోతేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లోని జాతీయ ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీలు వేసవిలో పనులకు త్వరగా వెళ్లి పనులు ముగించుకోవాలన్నారు. ఎండ తీవ్రతకు కూలీలు పనుల వద్ద నీడ ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీ దేవేందర్‌గౌడ్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

తండాల అభివృద్ధికి చేయూత

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలోని గిరిజన తండాల అభివృద్ధికి ఐక్యతా ఫౌండేషన్ తనవంతు చేయూత అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎల్లికట్టతండా, వెంకటాపూర్ తండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డికి తండా వాసులు ఘన స్వాగతం పలికారు. ఎల్లికట్ట తండాలో వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధితో పాటు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపడుతున్న కార్యక్రమాలను తండా వాసులకు వివరించారు. యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్ అందజేస్తామన్నారు. సర్పంచ్ రమేశ్ నాయక్ ఆధ్వర్యంలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి వినతి అందజేశారు. ఎంపీటీసీ శంకర్ నాయక్, నంబ్యానాయక్, లాచ్యానాయక్, దేశ్యా, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

‘దసరా’ సినిమాపై చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: దసరా సినిమా నుంచి అంగన్‌వాడీలను దొంగలుగా చూపించే సన్నివేశాన్ని తొలగించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పార్వతమ్మ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సినిమాలో అంగన్‌వాడీ టీచర్లను దొంగలుగా చిత్రీకరించారని, దాని ద్వారా అంగన్‌వాడీల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. సినిమాపై సెన్సార్‌బోర్డు చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి అశోక్, భాగ్యమ్మ, జయమ్మ, లక్ష్మమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్‌లో బాలికను వెన్నచర్లకి చెందిన వ్యక్తికి ఇచ్చి ఈ నెల 14న వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో విషయం తెలుసుకున్న సీడీపీఓ వెంకటరమణమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం దేవల్‌తిరుమలాపూర్‌కి వెళ్లి బాలిక తల్లి నాగలక్ష్మికి బాల్యవివాహం చేయవద్దని కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం బాలికను గ్రామంలోని ఉన్నత పాఠశాలకు పంపించాలని అధికారులు సూచించారు. పాఠశాలకు బాలికను పంపకుంటే నాగర్‌కర్నరూల్ సఖి కేంద్రానికి బాలికను తరలిస్తామన్నారు.



తిరుమలాపూర్‌లో బాల్యవివాహం చేయవద్దని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

అసత్య ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న మనోహర్

అచ్చంపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమని, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై అసత్యపు ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. శనివారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు దోచుకోవడం... దాచుకోవడం అనే నినాదంతో పని చేశారని, ప్రజలకు చేసింది శూన్యమన్నారు. అచ్చంపేటలో 100 పడకల ఆస్పత్రిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు 2015లో మంజూరు చేయించారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తానే మంజూరు చేశానని మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రకటించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసత్యపు ప్రకటనలు, అబద్ధాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తూ.. ఎమ్మెల్యేపై నిందలు వేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. డాక్టర్ వంశీకృష్ణ ప్రైవేటు ఆస్పత్రి పెట్టి దోచుకోలేదా.. అని ప్రశ్నించారు. కుర్చీ కోసమే పాకులాడుతున్నాడని, ప్రజలపై ఎలాంటి మమకారం లేదన్నారు. రెచ్చగొట్టే మాటలు మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె, బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి ఆరోగ్య తెలంగాణ దిశగా కృషి చేస్తోందన్నారు. రాజేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌రావు, నర్సింహారెడ్డి, రమేష్, హుస్సేన్, బాలరాజు, రాజు, శంకర్, కుతుబొద్దీన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం అవివేకం

బల్మూర్: డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ తనపై ఇంటి స్థలం ఆక్రమించుకున్నాడని అసత్య ఆరోపణ చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని బల్మూర్ సర్పంచ్ శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బల్మూర్‌లోని తన ఇంటి పక్కన ఉన్న జూలూరి మనెమ్మ ప్లాట్ నంబర్ 52ను తన కాంగ్రెస్ పార్టీకి చెందిన సత్యం అనే వ్యక్తే ఆక్రమించుకున్నాడన్నారు. ఇందులో తనకు ఎలాంటి ప్రమేయం లేకున్నా.. స్థానిక నాయకులు చెప్పిన మాటలు నమ్మి నిజాలను తెలుసుకోకుండా వంశీకృష్ణ పత్రికలకు తప్పుడు సమాచారం ఇవ్వడం తగదన్నాడు. కేవలం రాజకీయ పబ్బం కోసమే డీసీసీ అధ్యక్షుడు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై విమర్శలు చేస్తూ.. ఉనికి చాటుకుంటున్నాడని అన్నారు. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు.